క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వలిగొండ : మండలంలోని లోతుకుంట, సుంకిశాల, దాసిరెడ్డిగూడెం ఇండస్ట్రీయల్ ఫీడర్, వలిగొండ పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ మచ్చేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి గ్రామ సభలు

రామన్నపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఈ నెల 8,10,11, 13 తేదీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.జలేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న మునిపంపుల, బోగారం, సర్నేనిగూడెం, రామన్నపేట, ఇస్కిళ్ల, శోభనాద్రిపురం, జనంపల్లి, ఉత్తటూరు, 10న సూరారం, పల్లివాడలో, 11న నీర్నెముల, బాచుప్పలలో, సిరిపురం, లక్ష్మాపురం, కక్కిరేణి, కొత్తగూడెం, తుమ్మలగూడెంలలో, 13న వెల్లంకి, ఎన్నారం, బి.తుర్కపల్లి, దుబ్బాక, నిధానపల్లి, కొమ్మాయిగూడెం, కుంకుడుపాములలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 14న మండల కేంద్రంలో ఓపెన్‌ఫోరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంబులెన్సులో ప్రసవం

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన నిండు గర్భిణిని అంబులెన్స్‌లో నల్లగొండ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. మున్సిపాలిటీకి చెందిన పి.విజయలక్ష్మి రెండో కాన్పు నెలలు నిండడంతో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. పురిటి నొప్పులు మొదలు కావడంతో 108 అంబులెన్సులో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా నార్కట్‌పల్లి సమీపంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్సులోనే ప్రసవించి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బాబు క్షేమంగా ఉన్నారు. మెరుగైన చికిత్సకోసం నల్లగొండలోని మాత, శిశు కేంద్రానికి తరలించినట్లు 108 ఈఎంటీ శశికిరణ్, పైలట్ లాథినేని సోమేశ్వర్, ఆశ వర్కర్ బైరు అనిత తెలిపారు.

మాదిగ జేఏసీ పట్టణ అధ్యక్షుడిగా రమేష్



మునుగోడు: తెలంగాణ మాదిగ జేఏసీ మునుగోడు పట్టణ అధ్యక్షుడిగా జీడిమడ్ల రమేష్ నియమితులయ్యారు. సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి చంద్రస్వామి గురువారం రమేష్‌కు నియామక పత్రం అందజేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డిని గురువారం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

తుర్కపల్లి: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొల్ల కురుమలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం బీసీ వర్గానికి చెందిన అయిలయ్యకు మంత్రి పదవి ఇస్తే ఆలేరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): ఆలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జన్నాయికోడె నగేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇస్తే ఆలేరు నియోజక వర్గం అభివృద్ధి చెందుతుందన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు మునుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఇరువురు కృషి చేయాలని, అదేవిధంగా మునుగోడుకు సాగు నీరు అందించాలని కోరారు.

అధ్వానంగా సర్వీస్ రోడ్లు

- చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్న రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ సమీపంలో బురదమయంగా మారిన సర్వీస్‌రోడ్డు

చౌటుప్పల్ : రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రభుత్వాలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్లే ఇందుకు ఉదాహరణ. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. జాతీయ రహదారి నిర్మాణం జరిగి దశాబ్ద కాలం పూర్తయిన ఈ రోడ్డుకు ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్లను మాత్రం పూర్తిస్థాయిలో నిర్మించ లేదు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో సర్వీస్ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఇంకా మట్టిరోడ్డే ఉండడంతో చిన్నపాటి వర్షం వచ్చిన బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

బస్టాండ్ నుంచి బీఈడీ కళాశాల వరకు..

పట్టణ కేంద్రంలో ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి విజయవాడ మార్గంలో ఎలిమినేటి మాధవ రెడ్డి బీఈడీ కళాశాల వరకు సర్వీస్ రోడ్లు మరీ దారుణంగా ఉంది. బస్టాండ్ వద్ద, చిన్నకొండూరు చౌరస్తా సమీపంలో తారు రోడ్డు నిర్మాణం జరగలేదు. అదే విధంగా వలిగొండ రోడ్డు నుంచి బీఈడీ కళాశాల వరకు రోడ్డు నిర్మాణమే చేపట్టలేదు. మట్టిని తవ్వి వదిలేశారు.



వలిగొండ రోడ్డు సమీపంలోని సాయిబాబా దేవాలయం ఎదుట..



మాధవరెడ్డి బీఈడీ కళాశాల సమీపంలో..

జాతీయ రహదారి నిర్మాణం జరిగి సంవత్సరాలు గడుస్తున్న సర్వీస్ రోడ్లను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సర్వీస్‌రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పట్టణంలో సర్వీస్‌రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. విజయవాడ మార్గంలో వర్షం కురిస్తే రోజుల తరబడి సర్వీస్‌రోడ్డు బురదమయంగా ఉంటుంది. ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్యలను పరిష్కరించడం లేదు. పాదాచారులతోపాటు ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే భయపడాల్సి వస్తోంది.

– గుజ్జుల సురేందర్‌రెడ్డి, స్థానికుడు

ఎవరూ పట్టించుకోవడం లేదు



పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా సర్వీస్‌రోడ్లను తీర్చిదిద్దాలి. సర్వీస్ రోడ్లను ఎవరూ పట్టించుకోవడం లేదు. మట్టిరోడ్ల ప్రాంతంలో తారు రోడ్డు వేయాలి. రోడ్లపై దుమ్ము, ఇసుక లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి. సర్వీస్‌రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నాం.

– దండ అరుణ్‌కుమార్, మాజీ వార్డు సభ్యుడు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

రామన్నపేట : మండలంలోని ఉత్తటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం హోమం నిర్వహించారు. ధ్వజస్తంబం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ప్రతిష్ఠాపన విగ్రహాలకు జల, ధాన్య, పుష్ప, శయ్యాదివాస పూజలను నిర్వహించారు. శుక్రవారం యంత్రస్థాపన చేసి స్వామి వారి విగ్రహాన్ని ఆలయ ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోళ్ల స్వామి, మాజీసర్పంచ్‌లు మంచిరాజు శరత్‌చందర్, జెట్టి బాలమల్లయ్య, పొనుగోటి వెంకటేశ్వర్‌రావు, ఎడవల్లి దుర్గాప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

వలిగొండ : మండలంలోని సుంకిశాలలోని వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం కొనసాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యార్చన, ప్రాబోధిత, ప్రబంధ పారాయణం, పరమపాదోత్సవం, నివేదన, తీర్థ ప్రసాద గోష్టి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



రామన్నపేట : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రమణేశ్వరంలో..

భువనగిరి రూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో సిద్ధగురువు రమనానంద మహర్షి ఆధ్వర్యంలో చేపట్టిన శివలింగాల ప్రతిష్ఠాపన కొనసాగుతుంది. గురువారం దశ భైరవులకు, తాంత్రిక సిద్ధగురువులకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శివకలాన్యాసం, శక్తి కలాన్యసం చేసి భలిప్రదానం, నేత్రోన్మీలనం, కుంబాభిషేకం చేసి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



వలిగొండ : పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



భువనగిరిరూరల్ : పూజలు చేస్తున్న సిద్ధగురు రమణానంద మహర్షి

దైవ ప్రార్థనతో మానసిక ప్రశాంతత

శాలిగౌరారం: దైవ ప్రార్థనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ ఇంజనీర్, క్రైస్తవ బోధనల ముఖ్య ప్రసంగీకుడు బోగి శాంతారావు అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గోదల సత్తిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు గోదల వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్‌హాల్‌లో గురువారం రాత్రి మండల గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాంతారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా క్రైస్తవులు, పాస్టర్లు గీతాలాపనలు చేశారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు బోడ ఇజ్రాయిల్, తాందారి సీమోను, పాస్టర్లు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సమస్యల తిష్ట



అధ్వానంగా ఉన్న బస్టాండ్ లోపలికి వెళ్లే దారి



బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- అపరిశుభ్రంగా తుర్కపల్లి బస్టాండ్ పరిసరాలు
- ప్రయాణికులకు కనీస వసతులు కరువు

తుర్కపల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు తిష్ట వేశాయి. యాదాద్రిభువనగిరి జిల్లాకు.. సిద్దిపేట జిల్లాకు మధ్యలో ఉండడంతో నిత్యం ప్రయాణికులతో ఈ బస్టాండ్ కిటకిటలాడుతుంది. కానీ ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ ఆవరణలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో పాటు కంకరతేలి ఉండడంతో బస్సులు బస్టాండ్‌లోకి తీసుకురాకుండా రోడ్డు మీదనే నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక్కడ కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నప్పటికీ పరిశుభ్రత నామమాత్రంగానే వుంది.

వెలగని లైట్లు..

బస్టాండ్ లోపల, బయట ఉన్న లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో బస్సు కోసం ఎదురు చూసే ప్రయాణికులు భయబాంత్రులకు గురువుతున్నారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీ లేక పోవడంతో ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. దీనికి తోడు బస్టాండ్‌లో బస్ కంట్రోలర్ లేక పోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు వెళ్తుందో తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



బస్టాండ్ చుట్టూ ఉన్న రోడ్డంతా గుంతలమయంగా మారడంతో బస్సులు లోపలకి రావడం లేదు. బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో మరమ్మతులు చేపడితే బాగుటుంది. బస్టాండ్ అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలో నిలబడాల్సి వస్తోంది.

– కసిరబోయిన జహంగీర్, తుర్కపల్లి

సమస్యలు పరిష్కరించాలి



బస్టాండ్ పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. బస్టాండ్‌లోకి వెళ్లే దారంతా గుంతలమయంగా మారడంతో రోడ్డుపైనే బస్సులు ఆపుతున్నారు. బస్టాండ్‌లో లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

– ఇమ్మడి మల్లప్ప, సర్పంచ్, ముల్కలపల్లి

వసతులు కల్పించాలి



బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి. తాగునీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. రాత్రి సమయంలో లైట్లు వెలగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

– కొక్కొండ లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన నాయకులు

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకా రోత్సవ కార్యక్రమానికి గురువారం పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆలేరురూరల్ : మండలానికి చెందిన పలువురు నాయకులు గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి తరలి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎం.ఎజాజ్, వెంకటేశ్వర్లు, పేరపు సిద్దులు, ఎగ్గిడి శ్రీశైలం కలకుంట్ల లోకేష్, విక్రమ్, కర్రె అజయ్, నర్సింహులు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్ గౌడ్, కళ్లెపల్లి శ్రీశైలం, గుర్రం బాలస్వామి, గాజుల రవికుమార్, కుండె సిద్దులు, చిన్నం శ్రీశైలం పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిటౌన్ : కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్థికసాయం అందజేత

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకురాలు గోప యాదమ్మ మనవరాలు దివ్యకు జనసేన పార్టీ గ్రామ నాయకులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్య ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం అందించామని వారు తెలిపారు.

పెరిగిన చలి

భువనగిరిటౌన్ : తుపాన్ కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గడంతో చలి ఎక్కువైంది. దీంతో వృద్ధులు, చిన్నారులు చలికి వణకుతున్నారు. తెల్లవారుజామున ప్రజలు చలి మంటలు వేసుకుంటున్నారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు ఉన్ని దుస్తులు, రెయిన్ కోర్టులు, బ్లాంకెట్‌లు కొనేందుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసిన నాయకులు



ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్

చౌటుప్పల్ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని చౌటుప్పల్ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. పూలమాలలు, శాలవాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం ప్రజల కష్టాలు తీరుస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు తోడుగా నిలవాలని తెలిపారు. తనను గెలిపించేందుకు ఓటు వేసిన ప్రజలకు నిరంతరం అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తల మేలు మరువలేనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెలగ రాజశేఖర్‌రెడ్డి, గుండు మల్లయ్య గౌడ్, కొనుసం రాఖేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు నేర్చుకోవాలి

రామన్నపేట : విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలు నేర్చుకోవాలని పోలీసు జాగృతి కళాబృందం జిల్లా ప్రతినిధి బండ్ల కృష్ణ తెలిపారు. గురువారం రామన్నపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నైతిక విలువలు, మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలను తీసుకోవద్దని సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కావొద్దన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే వరకు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జాగృతి కళా బృందం సభ్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నకిరేకల్ : ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో ఈ నెల 8 నుంచి 9 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చింతకాయల పుల్లయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 9వ తరగతి చదువుతున్న శివాణి, అనిల్, వేణు, ఎనిమిదో తరగతి చదువుతున్న శివ, శ్రీవిద్య, శివాని, అను ఎంకయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, సర్పంచ్ నవీన్‌రావు అభినందించారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్



మాజీ సీఎం కేసీఆర్‌తో బూడిద భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట: మాజీ సీఎం కేసీఆర్‌ను ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ గురువారం ఎర్రవెల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట మాసాయిపేటకు చెందిన బుడిగె నర్సింగరావు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



భూదాన్‌పోచంపల్లి : స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం పట్టణ కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మెరుగు యతీనందం, అంకం పాండు, గోలి యాదగిరి, సీత సత్యనారాయణ, ఆనంద్, బాబు, నాగేశ్, సూర్య ప్రకాశ్, నర్సింహ, దామోదర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో అన్నదానం

మోత్కూరు : మండలంలోని దాచారం గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ అన్నదానం చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

గుంతలు పూడ్చిన యువకుడు

మునుగోడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ఎదురుగా మునుగోడు–చౌటుప్పల్ ప్రధాన రాహదారిపై ఉన్న పెద్దపెద్ద గుంతలను ఓ యువకుడు మట్టిపోసి పూడ్చివేశాడు. రోడ్డుపై గుంతలు ఉండడంతో అనేక మంది వాహనదారులు ఆ గుంతల వద్దకు రాగానే కింద పడిపోయి గాయాల పాలవుతున్నారు. దానిని గమనించిన మునుగోడు పట్టణానికి చెందిన గణేశ్ అనే యువకుడు తన సొంత డబ్బులతో ఒక ట్రాక్టర్ మట్టిని తీసుకొచ్చి గుంతల్లో పోసి రోడ్డును చదును చేశాడు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రభుత్వ అధికారులు చేయాల్సిన పనిని ఓ యువకుడు తన సొంత డబ్బులు ఖర్చుచేసి గుంతలు పూడ్చివేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



గుంతలను మట్టితో పూడుస్తున్న యువకుడు

బీటీ రోడ్డు వేశారు.. సీసీ మరిచారు

- అసంపూర్తిగా రామన్నపేట–లక్ష్మాపురం రోడ్డు మరమ్మతు పనులు
- ప్రతిపాదిత స్థలాల్లో సీసీరోడ్డు వేయకుండా వదిలేసిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

రామన్నపేట : రామన్నపేట – లక్ష్మాపురం రోడ్డు మరమ్మతు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. రామన్నపేట మండలకేంద్రం నుంచి నీర్నెముల, శోభనాద్రిపురం గ్రామాల మీదుగా లక్ష్మాపురం వరకు ఉన్న రోడ్డంతా గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. దీంతో గత ఏడాది ప్రారంభంలో అప్పటి ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు రూ 3.80కోట్లు మంజూరు చేసింది. దీంతో నీర్నెముల–శోభనాద్రిపురం గ్రామాల మధ్య వేసిన బీటీరోడ్డు వరకు పూర్తి చేశారు. మరమ్మతుల్లో భాగంగా నీర్నెముల గ్రామం శివారులో, చెరువు మలుపు, శోభనాద్రిపురం లక్ష్మాపురం కూడలి, లక్ష్మాపురం శివారులో పొలాల నీరు రోడ్డుపైకి వచ్చే చోట సుమారు కిలోమీటరు వరకు సీసీ రోడ్డు వేయాలని ప్రతిపాదించారు. కానీ సదరు కాంట్రాక్టర్ బీటీ రోడ్డు మాత్రమే వేసి సీసీ రోడ్డు వేయాల్సిన చోట చదును చేసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ వేయడానికి ప్రతిపాదించిన స్థలాల్లో రోడ్డును తవ్వి వదిలేయడంతో రోడ్డంతా ఇప్పుడు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ రోడ్డు ప్రయాణించాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్డు ప్రతిపాదించిన స్థలాల్లో సీసీ రోడ్డు వేయించాలని కోరుతున్నారు.



రామన్నపేట : నీర్నెముల–శోభనాద్రిపురం గ్రామాల మధ్య వేసిన బీటీరోడ్డు



రామన్నపేట : నీర్నెముల శివారులో సీసీ వేయకుండా వదిలేసిన రోడ్డు

పనులు పూర్తి చేయించాలి



బీటీరోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేశారు. నీర్నెముల శివారులో కొంతమేర సీసీ రోడ్డు ప్రతిపాదించారు. సీసీ వేయడం కోసం రోడ్డును కూడా తవ్వి వదిలేశారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సీసీ రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నాం.

– ముత్యాల సుజాత, సర్పంచ్, నీర్నెముల